andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.9। కనిష్ఠం 28.7



నిర్మల్ జిల్లా వార్తలు

6

మంగళవారం 21 మే 2024

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ కల్చరల్, మే 20 : నిర్మల్ పట్టణ 11 కేవీ ఫీడర్ 2 మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. కళానగర్, జూరా నగర్, కోయాక్సిల్, బాగులవాడ, పాన్‌గల్లీ, చిక్కడపల్లి, కస్బా, మయూరి హోటల్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ అంతరాయ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించి.. సహకరించాలని ట్రాన్స్‌కో అధికారులు కోరారు.

కడెం సిద్ధమయ్యేనా?

.... మందకొడిగా సాగుతున్న పనులు

- కడెం ప్రాజెక్టు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేనా !?
- జూన్ 2 వరకు పూర్తి కావాలని అధికారుల అల్టిమేటం
- రెండు నెలల వ్యవధిలో 60శాతం పనులు మాత్రమే పూర్తి
- ఇంకా పెండింగ్‌లోనే 40 శాతం మరమ్మతు పనులు
- సకాలంలో పూర్తి కాకపోతే మళ్లీ కడెంకు డేంజర్ బెల్స్!
- కడెం పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రాజెక్టు వద్ద అధికారుల నిరంతర పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఖానాపూర్, మే 20

గత రెండేళ్లుగా భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు వర్షాకాలం ఆరంభానికి ముందు సిద్ధం చేయాలని అధికారులు చేపట్టిన యుద్ధ ప్రాతిపదిక చర్యలు సఫలమయ్యేనా!? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండేళ్లుగా వచ్చిన భారీ వరదలకు కడెం ప్రాజెక్టు 18 గేట్లు పూర్తి స్థాయిలో పని చేయలేదు. దీంతో ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి ప్రాజెక్టు ఓవర్ ఫ్లో అయ్యింది. దీంతో ప్రాజెక్టు పైనుంచి వరద నీరు వెళ్లి ఒక దశలో కడెం ప్రాజెక్టు కొట్టుకుపోతుందా.. అనే స్థాయిలో అంతా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వరదలకు కడెం ప్రాజెక్టు తట్టుకొని నిలబడ్డప్పటికీ దాని గేట్లు పూర్తి స్థాయిలో పని చేయని పరిస్థితి నెలకొంది. దీంతో గేట్లను జేసీబీల సహాయంతో అధికారులు పైకి ఎత్తి ప్రాజెక్టులోని వరద నీటిని బయటకి పంపించారు. కాగా గత ఏడాది వర్షాకాలం నుండి ప్రాజెక్టు గేట్లు కిందికి వచ్చేలా లేకపోవడంతో ప్రాజెక్టులో నీరు నిల్వకుండా పూర్తి స్థాయిలో డెడ్ స్టోరేజ్‌కి చేరింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం కడెం ప్రాజెక్టు మరమ్మతుల విషయంపై పట్టించుకోకపోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేసింది. కాగా దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించని సందర్భంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రాజెక్టు వద్ద మరమ్మతు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రాజెక్టు మరమ్మతు పనులు ప్రారంభించేందుకు తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు హైదరాబాద్‌కు చెందిన స్వప్న ఏజెన్సీ ప్రాజెక్టు వద్ద మరమ్మతు పనులు చేసేందుకు ముందుకు రావడంతో మార్చి 7వ తారీఖున కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి.

● నెమ్మదిగా పనులు

భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు ప్రారంభించడంలోనే కాస్త ఆలస్యమైనప్పటికీ.. పనులు ప్రారంభమయ్యాక కూడా ఆశించిన స్థాయిలో వేగవంతంగా జరగడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కడెం ప్రాజెక్టుకు మొత్తం 18 గేట్లు ఉండగా.. 9 జర్మన్ గేట్లు, మరో 9ఇండియన్ గేట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా భారీ వరదలకు సదరు గేట్ల తాలూకు బేరింగ్‌లు, రోలర్స్, రబ్బర్ సీల్స్, సిడి యూనిట్స్, మోటార్, క్లచ్, బ్రేక్ లైనర్స్, బాల్ బేరింగ్స్, గేర్ బాక్స్‌లతో సహా మెకానికల్ సామగ్రి పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వరదల కారణంగా రెండో నెంబర్, 15వ నెంబర్ గేట్ల తాలూకు కౌంటర్ వేట్లు కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. పైన పేర్కొన్న పనుల్లో ఇప్పటి వరకు 60 శాతం పనులు పూర్తయిన ట్లు అధికారులు చెబుతున్నారు. కాగా మరో 40 శాతం పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉందని, జూన్ రెండో తేదీ లోపు ఈ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్టు సిద్ధమయ్యేలా కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● జూన్ 2 వరకు అధికారుల అల్టిమేటం

కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు జూన్ రెండవ తేదీ వరకు కడెం ప్రాజెక్టు కౌంటర్ వేట్ల అమరిక పనులు జూన్ 15వ తేదీ వరకు పూర్తి చేయాలని సంబంధిత మరమ్మతు పనుల నిర్వహణ ఏజెన్సీకి అధికారులు అల్టిమేటం జారీ చేసినట్లు చెబుతున్నారు. ఇదివరకే జర్మన్ గేట్ల తాలూకు 9 గేట్ల సిడి యూనిట్, మోటార్, క్లచ్, బ్రేక్ లైనర్స్, బాల్ బేరింగ్స్, గేర్ బాక్స్ పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ తొమ్మిది గేట్లలో నాలుగు గేట్లకు పూర్తి స్థాయిలో రబ్బర్ సీల్స్ బిగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా ఐదు గేట్లకు టాప్ రబ్బర్ సీల్స్ బిగించాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. 9 ఇండియన్ గేట్ల మరమ్మతులు ఎనిమిది గేట్లు రోలర్స్, బేరింగ్స్ మార్చిడి పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఒకటో నెంబర్ గేటు పనులు ఇంకా నిర్వహించాల్సి ఉందని, మరో రెండు రోజుల్లో ఆ గేటు సైతం సిద్ధం చెస్తామని, రెండో నెంబర్, 15వ నెంబర్ గేట్ల కౌంటర్ వేట్లను బిగించాల్సి ఉందని చెబుతున్న అధికారులు.. జూన్ 15వ తేదీ వరకు కౌంటర్ వేట్ల పనులు పూర్తి చేయాలని సదరు ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశారు. రాబోయే రోజుల్లో భారీ వరదలను సైతం తట్టుకునేలా టెక్నాలజీని వాడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



కడెం ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న సీసీ పనులు

▸▸ మరమ్మతులపై సర్కారు ప్రత్యేక దృష్టి

గత ప్రభుత్వ హయాంలో కడెం ప్రాజెక్టు మరమ్మతులపై నిర్లక్ష్యం జరిగిందని ఈ ప్రాంత ప్రజల్లో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కడెం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ఇక్కడి రైతాంగానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ. 5.46 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద రూ. 3.77 కోట్ల నిధులతో ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు రూ. 1 కోటి నిధులతో సీసీ పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు వద్ద పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రికల్ పనుల కోసం మరో మూడు కోట్ల రూపాయల నిధులను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ.. అవి ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి గత ప్రభుత్వం మూటగట్టుకున్న అపవాదులు తమ ప్రభుత్వం మూటగట్టుకోవద్దని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు ప్రాజెక్టు మరమ్మతు పనులను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.

సకాలంలో పూర్తి కాకుంటే మళ్లీ డేంజర్ బెల్స్ తప్పవంటున్న స్థానికులు

కడెం ప్రాజెక్టు మరమ్మతులు అధికారులు అనుకున్న సమయానికి పూర్తి చేయకపోతే మళ్లీ గత రెండేళ్లుగా ఎదురవుతున్న అనుభవాలే ఎదుర్కోవాల్సి ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకే గత రెండేళ్లుగా పంటలకు దూరంగా ఉండి నష్టపోతున్న కడెం ఆయకట్టు రైతాంగానికి ఈ ఏడాదైనా వానాకాలం పంట వేసుకునే అవకాశం కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ముందస్తుగానే రుతు పవనాలు వచ్చి వర్షాలు కురుస్తాయని ఓ పక్క వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో కడెం ప్రాజెక్టు గేట్లు మరమ్మతు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కడెం ఆయకట్టు కింద 60,000 ఎకరాల సాగు భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికారికంగా 60,000 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న కడెం ప్రాజెక్టు అనధికారికంగా మరో 40 వేల ఎకరాలకు పైగానే సాగునీటిని అందిస్తుందని స్థానిక రైతాంగం చెబుతుంది. నిర్మల్, మంచిర్యాల రెండు జిల్లాల్లోని రైతులకు జీవనాధారంగా ఉన్న కడెం ప్రాజెక్టును వానాకాలం పంటకు సిద్ధం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




కడెం ప్రాజెక్టు వద్ద మరమ్మతు పనులు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రాజెక్టు గేట్లకు అమర్చేందుకు సిద్ధంగా ఉన్న కౌంటర్‌వేట్లు



ప్రాజెక్టు గేట్లకు అమర్చేందుకు రబ్బర్ సీల్స్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం



కడెం ప్రాజెక్టు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గౌడ కులస్తులు

గౌడ కులస్తులకు సభ్యత్వం కల్పించండి

● అధికారులకు వినతిపత్రం అందజేసిన గౌడ కులస్తులు

నిర్మల్ కల్చరల్, మే 20 : నిర్మల్ పట్టణంలోని గీత పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని కోరుతూ గౌడ కులస్తులు సోమవారం కలెక్టర్‌తో పాటు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 15 సంవత్సరాల నుంచి తమకు సభ్యత్వం రాకుండా సంఘంలోని కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఈ విషయమై హైకోర్టు కూడా సభ్యత్వం కల్పించాలని ఆదేశించినా.. పేద గౌడ కులస్తులకు సభ్యత్వం ఇవ్వడం లేదన్నారు. తమకు సభ్యత్వం కల్పించకుంటే సీఎం రేవంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రిని కలుస్తామని, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులతో డిపో ఎదుట ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఆందోళనలో ఎస్. నారాయణ గౌడ్, వి. నర్సాగౌడ్, పి. రాజాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.



వానల్‌పాడ్ వాగులో బోల్తా పడ్డ లారీ

వంతెన పై నుంచి వాగులో బోల్తా పడ్డ లారీ

● స్వల్ప గాయాలతో బయటపడ్డ లారీ డ్రైవర్

భైంసా, మే 20 : భైంసా-నిర్మల్ జాతీయ రహదారి మార్గంలోని వానల్‌పాడ్ వంతెన వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. మంచిర్యాల జిల్లా దేవాపూర్ నుంచి భైంసాకు సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో అదుపు తప్పి వంతెన పై నుంచి వాగులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ లవ్‌కుష్ సరోజ్ (31) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ వంతెన గోడను ఢీకొట్టుకుంటూ వెళ్లి వాగులో బోల్తా పడటంతో ఎందుకు పనికి రాకుండా పోయింది. ప్రమాదంలో గాయపడ్డ లారీ డ్రైవర్ లవ్‌కుష్ సరోజ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా.. భైంసా రూరల్ పోలీసులు ఘటన స్థలిలో ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించారు.

కాల్వ నరసింహ స్వామి కల్యాణానికి ఏర్పాట్లు

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ పాలకవర్గ సభ్యులు



కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం



లక్ష్మీ నరసింహ స్వామి మూల విరాట్



కొనసాగుతున్న కల్యాణ మండపం పనులు

దిలావర్‌పూర్, మే 20 : భక్తుల కొంగు బంగారం, కోరిన భక్తుల కోరికలు తీర్చే ఇలవేల్పు... కాల్వ అడవుల్లో కొలువుదీరిన లక్ష్మీ సమేత నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. బుధవారం జరిగే అఖండ దీప స్థాపనతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఈ నెల 31వ తేదీన జరిగే మారు పెళ్లి, ఏకాంత సేవలతో ముగుస్తాయి. 23వ తేదీన అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. స్వామివారికి మొక్కులు చెల్లిస్తారు. సిర్గాపూర్ - న్యూ లోలం మధ్యలో 61వ జాతీయ రహదారి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి నిర్మల్ నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ప్రైవేట్ వాహనాలు సైతం నడుపుతారు. దిలావర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా సారంగాపూర్, కుంటాల, లోకేశ్వరం, నిర్మల్, సోన్ మండలాల నుంచి వందలాది మంది భక్తులు ఎండ్ల బండ్లలలో వస్తారు. స్వామివారి చెంతనే కొత్త ధాన్యాలతో వంటకాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. దిలావర్‌పూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

● చకచకా కల్యాణ మండపం పనులు

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కళ్యాణ మండపం నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేసింది. మండపం నిర్మాణానికి ఏడాదిన్నర గడువు విధించింది. ఇప్పటి వరకు పిల్లర్ల నిర్మాణం పూర్తయినా.. పైకప్పు నిర్మాణం జాప్యం జరిగింది. మరో రెండు రోజుల్లో స్వామివారి కల్యాణోత్సవం జరుగనుండటంతో పైకప్పు నిర్మాణం పనులు వేగంగా చేస్తున్నారు. కల్యాణోత్సవం వరకు పైకప్పు నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికి తాత్కాలిక కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి ఆ తర్వాత రెండు గదులతో పాటు శాశ్వత కల్యాణ వేదిక నిర్మించనున్నట్లు దేవస్థానం పాలకవర్గం సభ్యులు తెలిపారు.

అంతర్జాతీయ పద్య కవుల సమ్మేళనానికి ఎంపిక

ముథోల్, మే 20 : తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అంతర్జాతీయ శతాధిక పద్య కవుల సమ్మేళనానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులోని జరిగే ఈ సమ్మేళనానికి ఆయన హాజరు కానున్నారు. అంతర్జాతీయ సంస్థ కళా వేదిక చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్.. వెంకట్‌కు ఆహ్వాన పత్రాన్ని పంపారు. కాగా.. సమ్మేళనానికి ఎంపికైన వెంకట్‌ను జిల్లా కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

మునిపెల్లిలో బీహార్ యువకుడి మృతి

లక్ష్మణచాంద, మే 20 : బీహార్ రాష్ట్రానికి చెందిన లాల సహాని అనే యువకుడు మునిపెల్లి గ్రామంలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీ పని చేసుకోవడానికి బీహార్ నుండి వచ్చిన లాల సహాని(28) గ్రామంలోని ఒక భవనం పైన ఆదివారం నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి 2:30 గంటలకు బాత్రూంకి వెళ్లడానికి కిందికి దిగే క్రమంలో కాలు జారి భవనం పై నుంచి కింద పడ్డాడు. దీంతో తలకి గాయమై, ముక్కులో నుంచి తీవ్ర రక్తస్రావం జరిగి మరణించాడు. గత వారం క్రితం బీహార్ నుండి వచ్చిన 60 మంది హమాలీలలో ఇతను ఒకడు. మృతుడి తమ్ముడు అయిన వకీల్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని, మృతదేహాన్ని గ్రామస్తుల సహాయంతో బీహార్ రాష్ట్రానికి పంపడం జరిగిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



విత్తనాలు, ఎరువుల విక్రయాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● ఖానాపూర్ వ్యవసాయ అధికారి రవి

ఖానాపూర్, మే 20 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఆసం రవి అన్నారు. సోమవారం మండలంలోని సత్తనపెల్లి రైతు వేదికలో ఖానాపూర్, పెంబి రెండు మండలాలకు చెందిన సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ వ్యాపారస్తులకు వానాకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువుల విక్రయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతీ వ్యాపారి విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధర పట్టిక, దుకాణంలో ఉన్న విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలు, స్టాక్ రిజిస్టర్లు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ డీలర్స్‌తో పాటు పలువురు ఏఈవోలు పాల్గొన్నారు.



● నిరుపేద క్రీడాకారిణికి కిక్ బాక్సింగ్ కిట్ అందజేత

ఖానాపూర్, మే 20 : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి నాగలక్ష్మికి ఖానాపూర్‌కు చెందిన కృష్ణంరాజు ఆధ్వర్యంలో సోమవారం కిక్ బాక్సింగ్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు భీమన్న, రాము సాకేత్, సురేష్, శ్రీనివాస్, శ్రీను, శ్రీకాంత్, రవీందర్, రాజన్న, సురేష్, హరీష్ పాల్గొన్నారు.



పీఆర్టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకం


నిర్మల్ కల్చరల్, మే 20 : నిర్మల్ జిల్లా పీఆర్టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఒడ్నాల రవిరాజ్ నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ ఆదేశాలతో ఈ నియామకం జరిగినట్టు జిల్లా అధ్యక్షుడు వై. సాయన్న తెలిపారు.













ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ చిత్రంతో సరఫరా అయిన నోట్ బుక్కులు.. జిల్లా విద్యాశాఖ గోదాములో నిల్వ ఉన్న నోట్ బుక్కులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ చిత్రంతో..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్కులు

● పాఠశాలల ప్రారంభమయ్యే రోజు నుంచి అందించేందుకు ఏర్పాట్లు ● తొలి విడతగా జిల్లాకు 2,74,225 నోట్ బుక్కుల సరఫరా

భైంసా, మే 20 : ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేస్తుండగా.. గత ప్రభుత్వం అందించిన మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ముఖచిత్రంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని ఉన్నత, ఆదర్శ, కస్తూర్బా, తెలంగాణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్ అందించనున్నారు. నిర్మల్ జిల్లాలోని 189 ఉన్నత పాఠశాలలు, 17 కస్తూర్బా విద్యాలయాలు, ఒక మోడల్ స్కూల్, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ చిత్రంతో ఉన్న నోట్ బుక్స్ పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమయ్యింది. తరగతులవారీగా ఒక్కో విద్యార్థికి 5 నుంచి 11 పాఠ్య పుస్తకాల చొప్పున ఆంగ్లం, తెలుగు, ఉర్దూ మాధ్యమంలో అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 10వ తరగతి చదివే ఒక్కో విద్యార్థికి 6 నోట్ పుస్తకాల చొప్పున అందచేసేందుకు మొదటి విడతగా నిర్మల్ జిల్లాకు 2,74,225 చేరుకున్నాయి.

● తల్లిదండ్రులపై భారం తగ్గించేలా...

పేద విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారు. పుస్తకాలను పిల్లలకు ఉచితంగా అందించడం వల్ల తల్లిదండ్రులపై ఆర్థికంగా భారం తగ్గనుంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వారికి వర్క్ బుక్‌లు, 6 నుంచి 10వ తరగతి నోట్ బుక్కులు అందించనున్నారు. 2024-25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేది నుంచి ప్రారంభం కానుండడంతో అప్పట్లోగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు, నోట్ బుక్కులు అందించేలా విద్యా శాఖ చర్యలు తీసుకుంటోంది.

● పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అందిస్తాం..

● రవీందర్ రెడ్డి, డీఈవో, నిర్మల్

జిల్లాకు మొదటి విడుతగా 2,74,225 నోటు బుక్కుల సరఫరా జరిగింది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి నోట్ బుక్కులను జిల్లాలోని మండల విద్యా వనరుల కేంద్రాలకు చేరవేస్తాం. పాఠశాలలు ప్రారంభమయ్యే రోజు నుంచి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.







నిర్మల్ జిల్లాలో భానుడి భగభగ

ఖానాపూర్, మే 20 : నిర్మల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు వరుసగా 40 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. సోమవారం సైతం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నర్సాపూర్(జి) మండలంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. అత్యల్పంగా దస్తూరాబాద్ మండలంలో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. భానుడి తీవ్రతకు జిల్లాలోని నర్సాపూర్(జి), కడెం, మామడ, సారంగాపూర్, ఖానాపూర్, నిర్మల్ రూరల్, లక్ష్మణచాంద ఏడు మండ లాలను ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఉదయం నుంచే పలు మండలాల్లో ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండగా ఉంటున్న వాతావరణం మధ్యాహ్నం తర్వాత మాత్రం ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో చల్లబడుతూ మిశ్రమంగా మారుతోంది.

తర్లపాడ్‌లో విద్యుత్ ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపూర్, మే 20: మండలంలోని తర్లపాడ్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో సోమవారం రామెల్ల స్వామి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తర్లపాడ్ గ్రామంలోని ఓంకారేశ్వర స్వామి ఆలయ సమీపంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏబీ స్విచ్ ఏర్పాటు చేసేందుకు పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు నిలబెట్టే క్రమంలో పైన ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌కు స్తంభం తగలడంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. స్తంభాన్ని గుంతలో సరిగ్గా నిలిపేందుకు పట్టుకుని ఉన్న కాగ జ్‌నగర్‌కు చెందిన రామెల్ల స్వామి అనే వ్యక్తి ఈ ప్రమాదంలో గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ జిల్లా కేంద్రాసుపత్రికి తరలించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 33 కేవీ విద్యుత్ వైర్ల కింద పని చేస్తున్న సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ కనీసం ఎల్‌సీ తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు సార్ల నర్సయ్య, నాగెల్లి నర్సయ్య, పెద్ది రమేష్, బి. వెంకటేష్, మహేందర్, తదితరులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమా ండ్ చేశారు. కాగా.. ఈ విషయమై టీఎస్ ఎన్పీడీసీఎల్ ఖానా పూర్ ఏడీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం షార్ట్ సర్క్యూట్‌కి గురైన వ్యక్తికి ఎటువంటి ప్రమాదం లేదని తెలి పారు. ఉదయం ఎత్తైన విద్యుత్ స్తంభాలు నిలబెట్టే క్రమంలో ఎల్‌సీ తీసుకునే పని చేశారని సపోర్ట్ స్తంభాలు వేసే సమయంలో మాత్రం ఎల్‌సీ తీసుకోలేదన్నారు. విద్యుత్ వైర్లు సపోర్ట్ స్తంభాల కంటే పైకి ఉండడంతో ఎల్‌సీ తీసుకునే అవసరం లేదని నిర్ధారణ చేసుకుని పనులు నిర్వహించారని పేర్కొన్నారు. కాగా విద్యుత్ స్తంభాలను పైకి ఎత్తే ట్రాక్టర్ డ్రైవర్‌కి కంటిలో సూర్యకిరణాలు పడడంతో స్తంభం విద్యుత్ వైర్లకు తగిలేది గమనించక ప్రమాదం జరిగినట్లు ఆయన తెలిపారు.



షార్ట్ సర్క్యూట్‌కు గురైన స్వామిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది



జిల్లాకేంద్రంలో విత్తనాల కోసం షాపులఎదుట బారులు తీరిన రైతులు

విత్తనాల కోసం అన్నదాతల బారులు

● స్టాక్ లేక పోవడంతో రైతుల ఆగ్రహం

● వ్యవసాయ అధికారులతో రైతుల స్వల్ప వాగ్వాదం

ఆదిలాబాద్ అర్బన్, మే 20: పట్టణంలోని విత్తన షాపుల వద్ద ఉదయం నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారు.పత్తి విత్తనాల కోసం అన్నదాతలు బారులు తీరారు. మార్కెట్, డీలర్ల వద్ద అందుబాటులో లేక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే శనివారం రోజు వచ్చిన రైతులకు సోమవారం విత్తనాలు అందిస్తామని డీలర్ చెప్పడంతో రైతులు వెళ్లిపోయారు. తీరా సోమవారం ఉదయం నుంచి షాపు ఎదుట క్యూ కట్టిన తర్వాత సంబంధిత డీలర్ స్టాక్ రాలేదని చెప్పడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విత్తనాల షాపుల వద్దకు ఏఓ రమేష్ చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేసిన రైతులు వినలేదు. దీంతో రైతులు, అధికారుల మధ్య కొంత వాగ్వాదం చేటు చేసుకుంది. ఈ సందర్భంగా ఏవో రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు అందుబాటులో ఉంచాలనే కంపెనీలతో ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు మాట్లాడడం జరిగిందని తెలిపారు. మార్కెట్‌లో ఒకే రకం పత్తి విత్తనాలకు డిమాండ్ పెరగడంతో కంపెనీలు కూడా పూర్తి స్థాయి పంపిణీలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. రాశీ కంపెనీ తమిళనాడుకు చెందిందని, సీడ్స్ ప్రాసెసింగ్‌లో ఇబ్బందుల కారణంగా తక్కువ స్టాక్ ఇస్తున్నట్లు తెలిపారు.అయితే ఇదే విషయమై వ్యవసాయ శాఖ అధికారి హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపారు.జూన్ మొదటి వారంలో రైతులకు పూర్తి స్థాయిలో విత్తనాలు అందుబాటులో ఉండేలా శాఖ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కుచ్లాపూర్ గ్రామానికి చెందిన రైతు ఠాగూర్ గణేష్ మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస ఫర్టిలైజర్ వారు సోమవారం రాశి 659 విత్తనాలు ఇస్తామని తెలుపడంతో ఉదయం నుంచి తిండి తిప్పలు మానుకొని క్యూ లైన్‌లో నిల్చున్నామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తీరా స్టాక్ లేదనే బోర్డును పెట్టారన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో విత్తనాలు ఇవ్వాలని కోరారు.



బోథ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి, సిబ్బంది

'విత్తనాల కొరత సృష్టిస్తే కేసులు తప్పవు'

బోథ్, మే 20: వ్యవసాయ దారులకు వ్యాపారులు విత్తన కొరత లేకుండా చూడాలని, కావాలని ఎవరైనా విత్తన కొరత సృష్టిస్తే కేసులు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి వెండి విశ్వామిత్ర పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కోరమండల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తన దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కంపెనీల ద్వారా డీలర్లకు సరఫరా అయిన విత్తనాల స్టాక్ ను పరిశీలించడం జరుగుతుంన్నారు. విత్తన విక్రయాలలో అవకతవకలు జరగకుండా పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తున్నామన్నారు. మార్కెట్లో రైతులకు ఇబ్బంది కలగకుండా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. విత్తనాలు ఎరువుల విక్రయాలలో ఏవైనా అక్రమాలు జరిగితే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

'ఎమ్మెల్యే చెప్పినా.. పని కల్పించరా?'

బోథ్, మే 20 : బోథ్ మార్కెట్ పరిధిలో జొన్నలకు కాంటాల సంఖ్య పెంచి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడటంతో పాటు పని లేని హమాలీలకు పని కల్పించాలని ఎమ్మెల్యే చెప్పినా పని కనిపించడం లేదని వ్యవసాయ మార్కెట్ కమిటీలో సోమవారం పలువురు హమాలీలు వాపోతున్నారు. అయితే తాము పని కల్పించాలని ఎన్నిసార్లు విన్నవించినా స్థానికంగా ఉన్న అధికారులు పని కల్పించకుండా తమ ఉపాధికి దెబ్బ కొడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం నుంచి పని కల్పిస్తామని చెప్పినా.. పని కల్పించకపోవడంతో పని లేక పస్తులు ఉండాల్సి వస్తుందని, మార్కెట్ సహకార సంఘం వారు చర్యలు తీసుకోవాలని కోరారు.



హాల్ టిక్కెట్లను పరిశీలించి లోనికి అనుమతిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌లో ప్రశాంతంగా టెట్ పరీక్ష

మావల, మే 20: సోమవారం ప్రశాంతంగా టెట్ పరీక్ష కొనసాగింది. జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో నిర్వహించిన టెట్ పరీక్షకు ఉదయం సెషన్‌కు 57 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 32 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే విధంగా మధ్యాహ్నం సెషన్‌లో 100 మందికి 81 మంది పరీక్ష రాసినట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావ్ తెలిపారు.

గోళ్లగాడ్ రోడ్డును పరిశీలించిన డీఈఈ

భీంపూర్, మే 20: మండలంలోని బోర్లకుంట ప్రాంతం నుంచి సరిహద్దు గోళ్లగాడ్ వరకు 5కిలోమీటర్ల లింకు రోడ్డు నాణ్యతగా లేదని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి సీతక్క స్పందించారు. అనంతరం ఉన్నత అధికారుల ఆదేశాలతో సోమవారం ఈ మట్టిరోడ్డును డీఈఈ శివరాం, ఏఈఈ మజర్, ఏఈ వివేక్, కార్యదర్శి వెంకట్‌లు పరిశీలించారు. అసలు ఈ రోడ్డు నిర్మాణం కోసం పాలన పరమైన అనుమతులే లేవు అని డీఈఈ స్పష్టం చేశారు. అయితే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద ఈ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు అయిన ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత టెండర్ ప్రక్రియ మొదలవుతుందని తరువాత నాణ్యతగా రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన వివరించారు.



గోళ్లగాడ్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

జొన్న రైతుల అరిగోస!

● తాంసిలో అస్తవ్యస్తంగా జొన్న పంట కొనుగోలు ప్రక్రియ ● రోజుల తరబడి రోడ్డుపైనే రైతుల పడిగాపులు

● వర్షాల నేపథ్యంలో మరింత ఆందోళన ● అయినా.. పట్టించుకోని పాలకులు, సంబంధిత శాఖ అధికారులు



తాంసి మండలకేంద్రంలో రోడ్డుపైనే ఉన్న జొన్న కుప్పలపై వర్షానికి తడవకుండా రైతులు కప్పిన పారీలు

తాంసి, మే 20: జొన్న రైతుల కష్టాలు అంతా ఇంతా కావు. చెమటోడ్చి పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో ఆ రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం అని చెప్పవచ్చు. నీళ్లకు, తిండికి దూరమై రోజుల తరబడి రోడ్డుపైనే నిద్రిస్తున్న సంఘటన తాంసి మండల కేంద్రంలో చోటు చేసుకుంటుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన తాంసిలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో గత 25 రోజుల నుంచి జొన్నలను కొనుగోలు చేస్తున్నారు. అయితే కూలీల కొరతనో... లేక అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు గాని జొన్న రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. వాస్తవానికి ఉదయం పూటే కొనుగోలు చేయాల్సిన అధికారులు మధ్యాహ్నం వరకు కూడా కొనుగోలు చేయడం లేదని రైతులు అంటున్నారు. దీంతో ఎప్పుడు వర్షం వస్తుందో ఎప్పుడు తమ ధాన్యం తడుస్తుందోనన్న ఆవేదనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. ఇక నుంచి అయినా జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

● మూడు రోజులుగా రోడ్డుపైనే.. : పొచ్చెన్న, రైతు, తాంసి

గడిచిన మూడు రోజుల నుంచి జొన్నలు రోడ్డుపై పోసుకుని ఆ కుప్ప వద్దనే నిద్రపోతున్నారు. మూడు రోజుల నుంచి నీళ్ళకు, తిండికి దూరమయ్యాను. ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదు. కనీసం తమను పలకరించే నాథుడే కరువయ్యాడు. అప్పుడే ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీస్తూ ఉంటే తాము ఆందోళన చెందుతున్నాం. ఇక నుంచి అయినా పకడ్బందీ చర్యలు చేపట్టాలి.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టీచర్స్ కాలనీలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

ఇచ్చోడలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

● 'ఇలా ఉంటే వ్యాధులు రావా?' అనే కథనానికి పంచాయతీ అధికారుల స్పందన ● పలు కాలనీల్లో చెత్తాచెదారం తొలగింపు

ఇచ్చోడ, మే 20: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో దుర్గంధ భరితంగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో సోమవారం పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులను చేపట్టారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' మినీలో 'ఇలా ఉంటే వ్యాధులు రావా?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేప ట్టారు. ఖాళీ స్థలంలో నుంచి నిల్వ ఉన్న నీరు ముందుకు కదలక పోవడంతో నీరంతా నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. దీంతో ఇచ్చోడ గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్ పంచాయతీ సిబ్బంది తో కలిసి జేసీబీ సహాయంతో కాలువను తీయించి, ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో కాలనీ వాసులకు కాస్తా ఉపసమనం కలిగింది. వ్యాధుల కాలం వర్షా కాలంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ అధికారులను పలువురు కాలనీవాసులు కోరారు.



మాట్లాడుతున్న నూతుల రవీందర్



పాల్గొన్న విద్యార్థులు

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

● జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉట్నూర్, మే 20: నేటితరం విద్యార్థులు మూఢ నమ్మకాలు నమ్మకుండా శాస్త్రీయ నూతన విధానాలను నమ్మాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎం మరిచి భవనంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవడం ఎలా అన్న అంశం పై విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆదిలాబాద్ జిల్లా కమిటీ పక్షాన అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ మాట్లాడుతూ గ్రామీణ గిరిజన ప్రాంతాలలో చాలా మంది గిరిజనులు ఇంకా మూఢ నమ్మకాలను నమ్ముతు మోసపోతున్నారని అలాంటి వారికి నూతన శాస్త్రీయ విధానాల గురించి వివరించాల్సిన బాధ్యత భావి భారత పౌరులైన విద్యార్థులపై ఉందన్నారు. గిరిజన గ్రామాలలో ఇంకా మంత్రతంత్రాలను నమ్మడంతో పాటు కొందరు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాలను బలంగా పెడుతున్న సంఘటనలు మనం చూస్తునే ఉన్నామని అన్నారు ఏవైనా వ్యాధులు సంక్రమించినప్పుడు మూఢనమ్మకాలను పాటించే వారికి వైద్యసేవలు అందుకోవా లని గ్రామాలలో విద్యార్థులు చైతన్యం కలిగించాలన్నారు.ఈ కార్యక్రమంలో జీసీడీఓ ఛాయా, సైన్స్ మేజిషియన్ మేస్రం రాజు, ఉట్నూర్ మండల ప్రధాన కార్యదర్శి బాధు, స్పోర్ట్‌కోచ్ సునంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ ప్రచారం

బోథ్, మే 20: ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందని విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని జూనియర్ కళాశాల అధ్యాపకులు మండలంలోని పోచ్చెర కనుగుట్ట, మరల పల్లి గ్రామాలలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలపై అవగాహన కలిగించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఉచిత పుస్తకాలతో పాటు భోజన వసతి స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులను ఆన్లైన్లో దరఖాస్తు చేస్తూ వివరించారు.



ఊరురా ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

తునికాకుతో ఉపాధి

ఎండకాలం తునికి ఆకు సీజన్ ఆదివాసీలు సమీప అడవికి వెళ్లి తునికి ఆకు సేకరిస్తున్నారు. ఇంటిల్లి పాది ఎండకు ఇంటి వద్ద నీడపట్టున సరదా కబుర్లు చెప్పుకుంటు బీడీ ఆకులు కట్టలుగా చేస్తున్నారు. తర్వాత ఇళ్ల, కొట్టాలపై ఆకు కట్టలు ఎండకు ఆరబెట్టి మంటల్లో కల్లాలకు తరలించి ఉపాధి పొందుతున్నారు. సిరికొండ మండలంలోని ఆదివాసీ పల్లెలలో బుధవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కిన దృశ్యాలివి.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



1



2



3

1), 2) బీడీ ఆకుల కట్టలు కడుతున్న దృశ్యం

3) ఇంటి పై కప్పుపై కట్టలను ఎండకు ఆరబెట్టిన దృశ్యం



మార్కెట్‌కు జొన్న పంటతో తరలివచ్చిన రైతులు

'24 వరకు జొన్నలు తీసుకురావద్దు'

బోథ్, మే 20: బోథ్ మార్కెట్ కమిటీ ఆవరణలో కొనుగోలు చేస్తున్న జొన్నలు ఈనెల 24 వరకు మార్కెట్‌కు తీసుకురావద్దని సహకార సంఘం సీఈవో గోలి స్వామి తెలిపారు. భారీ వర్షాల కారణం గా పంట తడిసిపోయే ఆస్కారం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు పంటను తీసుకువచ్చిన తాము మాత్రం కొనుగోలు చేయమన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించాలని సీఈవో కోరారు.

● భారీగా తరలివచ్చిన జొన్న పంట ట్రాక్టర్లు

20వ తేదీ నుంచి 24 వరకు మార్కెట్ యార్డులో జొన్న పంట కొనుగోలు నిలిపివేస్తామని సెంటర్ ఇన్‌చార్జీ గోలి స్వామి తెలిపిన రైతులకు సమాచారం చేరకపోవడంతో సోమవారం భారీ సంఖ్యలో జొన్న పంటను ట్రాక్టర్‌లలో తీసుకుని రైతులు తరలివచ్చారు. అయితే చివరకు మార్కెట్ కమిటీ అధికారులు చైర్మన్ జోక్యంతో బయట ఉన్న వాహనాలను లోనికి అనుమతించారు. అయితే మంగళవారం ఎవరూ కూడా మార్కెట్‌కు జొన్నలను తీసుకురావద్దని.. తీసుకువస్తే కొనుగోలు చేసేది లేదని, లోపలికి అనుమతించమని సెంటర్ ఇన్‌చార్జీ స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకులు

'ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి'

ఆదిలాబాద్ అర్బన్, మే 20: ఎదుటి వారిని విమర్శించే ముందు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం నాయకురాలు అన్నపూర్ణ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నాలనగేష్ కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేఏ పాల్ అంటూ వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడడం, అసత్యాలు ప్రచారం చేయడం, అసభ్య పదాజాలంతో దూషించడం మానుకోవాలని హెచ్చరించారు. ఎదుటివారిని విమర్శించే ముందు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.హిందు ధర్మం, దేశభక్తి పై గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు బొట్టు ఎందుకు పెట్టుకున్నావని ఇటీవల పార్లమెంట్ పోలింగ్ సందర్భంగా ప్రశ్నించడం సిగ్గు చేటన్నారు. ఇదేనా మీరు నేర్చుకున్న సంస్కృతి అంటూ ఆమె తప్పు బట్టారు. ఒకరిపై దుమ్మెత్తి పోయడం, సోషల్ మీడియా వేదికగా అసభ్య, అనుచిత పోస్టులు పెట్టడం ఎంత మాత్రం సరికాదన్నారు. ఇందులో కాంగ్రెస్ మహిళ విభాగం నాయకురాలు డి.శ్రీలేఖ, లత, సోనియా, తదితరులు పాల్గొన్నారు.



గంగన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీ

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఉట్నూర్, మే 20: మండలంలోని గంగన్నపేటలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ గోడంత్రయంబక్‌రావు పరిశీలించారు. రైతులు పండించిన వరి ధాన్యం సక్రమంగా కొనుగోలు చకేయాలని తేమ పేరుతో రైతులకు ఇబ్బందులు పెట్టవద్దనిరైతులు అమ్మిన వరిధాన్యం అకాల వర్షాలకు తడవకుండా చూడాల న్నారు. రైతులు అమ్మకానికి తెచ్చిన ధాన్యం తూకంలో ఎలాంటి మోసాలకు తావు ఇవ్వవద్దన్నారు.

'ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి'

తాంసి, మే 20: ప్రతి సోమవారం ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా దర్బార్ ను నిర్వహించారు. గోట్కూరి, బండల నాగపూర్, పొన్నారి గ్రామాలకు చెందిన పలువురు తమకు ఉపాధి కూలీ డబ్బులు సకాలంలో అందడం లేదని వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలలో తమను భాగస్వాములను చేయడం లేదని విన్నవించారు. తాము పండించిన జొన్నలను కొనుగోలు చేయకుండా వ్యాపారులు కొనుగోలు చేసే అమ్ముతున్న జొన్నలకు ఎక్కువ డిమాండ్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే కలెక్టర్‌కు విన్నవించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అసౌకర్యాలు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు వారి వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు



నారాయణ(ఫైల్)


ఇంద్రవెల్లి, మే 20: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ డిగ్రీ విద్యార్థి మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. సోమవారం మండలంలోని హర్కాపూర్ (అందుగూడ) గ్రామానికి చెందిన డాకురే నారాయణ(21) అనే డిగ్రీ విద్యార్థి కనడటంలేదని విద్యార్థి తండ్రి డాకురే మారుతి ఫిర్యాదు చేశారు. ఆయన ఎక్కడైనా కనపడితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగలరని స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి



అరవింద్(ఫైల్)

బోథ్, మే 20: మండలంలోని కుచలాపూర్ గ్రామానికి చెందిన బి.అరవింద్(28) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ బి రాము తెలిపిన ప్రకారం.. మృతుడు ఈ నెల 6న ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆ తర్వాత సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆయన కోసం వెతుకుతూనే తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే దాదాపు 15 రోజులు కుటుంబీకులు వెతికిన దొరకకపోగా గ్రామం సమీపంలోని ఓ చేన్లో కనిపించాడు పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా కుక్కలు తిరిగివేశాయి అయితే సోమవారం మధ్యాహ్నం పూట చేను యజమాని జొన్న పంటకు నిప్పు పెడుతున్న సమయంలో కుక్కలు శవాన్ని తినడం చూసి గ్రామంలో తెలపడం జరిగింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సిఐ రమేష్, ఎస్ఐ రాము చేరుకున్నారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.



జిల్లాకు అవసరమైన ఎరువుల వివరాలు

యూరియా	30వేల (మెట్రిక్ టన్నులు)
డీఏపీ	13వేల (మెట్రిక్‌టన్నులు)
ఎంవోపీ	7వేల (మెట్రిక్‌టన్నులు)
ఎన్‌పీకేఎల్	36వేల (మెట్రిక్ టన్నులు)
ఎస్ఎస్‌పీ	4వేల (మెట్రిక్ టన్నులు)

సాగు ప్రణాళిక.. సిద్ధం



● జిల్లా కేంద్రంలో ఎరువులు, విత్తన షాపుల ముందు రైతుల సందడి



● పంటల సాగుకు ముందే షాపుల ముందు నో స్టాక్ బోర్డు ఇలా..

- జిల్లాలో 5లక్షల 79వేల 638 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం
- మళ్లీ ఈ యేడు పత్తి పంట వైపే మొగ్గుచూపుతున్న రైతులు
- ఇప్పటికే వేసవి దుక్కులను పూర్తి చేసి పంటచేలను చదును చేసిన అన్నదాతలు
- తొలకరి వర్షాలతో సాగు ప్రారంభం
- వెంటాడుతున్న కల్తీ విత్తనాల బెడద.. పెట్టుబడుల కోసం ఉరుకులు పరుగులు
- వానాకాలం సీజన్ పంటల సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- జిల్లావ్యాప్తంగా ఈ దఫా 4.16 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా


ఆదిలాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. దీననుగుణంగానే 2024 -25 సంవత్సర పంటల సాగును చేపట్టనున్నారు. ఈ యేడు జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5లక్షల 79వేల 638 ఎకరాలు కాగా, ఇందులో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని నేలలకు అనుగుణంగా పత్తి, సోయా, కంది, జొన్న, మొక్కజొన్న పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. గతేడు సమృద్ధిగా వర్షాలు కురవడంతో దిగుబడులు ఆశాజనకంగానే కనిపించాయి. కానీ భారీ వర్షాలతో లక్షకు పైగా ఎకరాలలో పంట నష్టం జరిగింది. ఈ యేడు రైతులు మళ్లీ వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో మే చివరి మాసంలోనే పంటల సాగుకు శ్రీకారం చుడుతారు. ముఖ్యంగా నీటి వసతి ఉన్న రైతులు పత్తి, సోయా, కంది పంటలను సాగు చేస్తారు. వానాకాలం పంటల ప్రణాళిక ఆధారంగానే అవసరమైన ఎరువులు, విత్తనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 90వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు ప్రాథమిక అంచనా వేస్తుండగా మళ్లీ 10లక్షల 42వేల 422 పత్తి ప్యాకెట్లు, 27వేల 528 క్వింటాళ్ల సోయాబీన్ విత్తనాలు, 24వేల 498 క్వింటాళ్ల కంది విత్తనాలు, 455 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని అధికారులు గుర్తించారు. అయితే వానాకాలం పంటల సాగుకు ముందే కల్తీ విత్తనాల జోరు కనిపిస్తోంది. మరో వారం రోజుల్లోనే వానాకాలం పంటల సాగు ప్రారంభంకానుంది. దీంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో తొలకరి వర్షాలు కురవగానే పంటల సాగుకు ప్రారంభించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులతో పంట చేలను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. జిల్లాలో అత్యధికంగా డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు వ్యాపారులు కావాలనే విత్తనాల కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. కల్తీ విత్తనాలతో పాటు అధిక ధరలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖాధికారులు ప్రత్యేక చొరవను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ యేడు గంపెడు ఆశలతో పంటల సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతకు వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే సాగు లాభసాటిగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ పత్తిదే పెత్తనం

జిల్లాలో నల్లరేగడి నేలలకు అనువైన పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో మళ్లీ పత్తి పంటదే పెత్తనం కనిపిస్తుంది. గత రెండు మూడేళ్లుగా మద్దతును మించిన ధర పలకడంతో ఈ పంట వైపే రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ యేడు జిల్లావ్యాప్తంగా 4లక్షల 16వేల 969 ఎకరాలలో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికిగాను 10లక్షల 42వేల 422 పత్తి ప్యాకెట్లు అవసరమని అధికారులు గుర్తించారు. కానీ అప్పుడే ఎరువులు, విత్తనాల దుకాణాల ముందు నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అయితే లాభదాయకమైన పత్తి పంటనే సాగు చేయాలని అధికారులు కూడా సూచిస్తున్నారు. అలాగే సోయా పంట 91వేల 762 ఎకరాలు, కంది 61246 ఎకరాలు, జొన్న 2068 ఎకరాలు, వరి 1823 ఎకరాలు, మొక్కజొన్న 4140 ఎకరాలు సాగు కాగా మిగిలిన ఎకరాలలో మినుము, పెసర, ఇతర పంటలు సాగుకానున్నాయి. జిల్లాలో అధికంగా సాగు చేసే పత్తి పంట సాగుకు అవసరమైన విత్తనాలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. అయితే కొన్ని మేలు రకమైన హైబ్రిడ్ విత్తనాలు మార్కెట్‌లో దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో నాన్ సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉండడంతో రైతులు కొనుగోలు చేస్తూ నిల్వ చేసుకుంటున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల కొరతను సృష్టించి అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. బీటీ-3 లూజు విత్తనాలను రహస్యంగా కొనుగోలు చేస్తూ సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఈ రకమైన విత్తనాన్ని నిషేధించిన రైతులు మాత్రం సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే బీటీ-3 పత్తి పంటకు రౌండప్ మందులతో కలుపు నివారణ చేసుకునే అవకాశం ఉండడంతో ఎక్కువగా ఈ విత్తనాల కోసం ఆసక్తి చూపుతున్నారు. పత్తిని సాగు చేసిన రైతులు రెండవ పంటగా శనగ, జొన్న, కంది పంటను సాగు చేసే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు పత్తి పంట వైపేమొగ్గు చూపుతున్నారు.

డిమాండ్‌ను బట్టి ఎరువులు

జిల్లాలో రైతుల డిమాండ్‌ను బట్టి ఎరువులను సరఫరా చేసేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ యేడు వానకాలం సీజన్‌లో 90వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం 40 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తొలకరి వర్షాలకే పత్తి, సోయా పంటలను విత్తుతే ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పునరావృతమైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. రుతుపవనాలు రాక ముందే సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉండే విధంగా రైతులు కొనుగోలు చేస్తూ నిల్వ చేసుకుంటున్నారు. అవసరమైన ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచితేనే ఇబ్బందులు తప్పనున్నాయి. రైతులందరు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసేందుకు ఎగబడితే గందరగోళ పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉందంటున్నారు. అందరు ఒకేసారి కాకుండా సీజన్ ప్రారంభానికి ముందే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేయాలని అధికారులు అవగాహన కల్పించాలి. ఈనెల చివరి వరకు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేస్తే మార్కెట్‌లో కొంత మేరకు రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది. అయితే అధికారులు నెలవారిగా ఎరువుల డిమాండ్‌ను బట్టి సరఫరా చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో యూరియా కొరత ఏర్పడడంతో అధిక ధరలకు రైతులు కొనుగోలు చేసిన పరిస్థితి ఏర్పడింది. ఈసారి అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా జిల్లాకు సరిపడా ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.



అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

: శివకుమార్, ఏవో, ఆదిలాబాద్

జిల్లాకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు విత్తనాలను ఎంపిక చేసుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. నేలలకు అనువైన ఎరువులను, విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. సరైన తేమలోనే విత్తనాలను వేసుకోవాలి. అతి దీమాతో విత్తనాలను వేసుకుని నష్ట పోవద్దు. కనీసం నేలలో 60శాతం తేమ ఉంటేనే విత్తనాలు వేసుకోవాలి. రైతులు ఆదర బాదరగా పంటల సాగు చేసి నష్ట పోవద్దు. ఏదైనా అనుమానాలు సమస్యలు ఎదురైతే వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించాలి.

సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమోహన్

'విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ధ్రువప్రత్రాల జారీ'

తలమడుగు, మే 20: ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థుల కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో పాటు రైతులకు పట్టా పాస్ బుక్‌లు, పహానీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందిస్తున్నామన్నారు. సంబంధిత దరఖాస్తుదారులు మధ్యవర్తులను నమ్మిమోసపోకుండా నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో నకిలీ విత్తనాలను అరికట్టే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. మార్కెట్లో రైతులు విత్తనాలు కొనే ముందు తప్పనిసరిగా రషీదులు పొందాలని సూచించారు.

క్రీడకారులకు ప్రోత్సాహం

నేరడిగొండ, మే 20: మండలకేంద్రంలో నిర్వహించే నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముత్యాలీబాయి హమ్ము నాయక్ వెల్ఫేర్ సోసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆడే నూర్‌సింగ్ నాయక్, పీఆర్టీయూ టీజీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లీగ్ మొత్తానికి రూ.5వేలు విలువ గల అన్ని బాల్స్‌ను లీగ్ నిర్వాహకులకు అందజేశారు. ఇందులో నిర్వాహకులు జె.పవన్ కుమార్, అన్ని జట్ల కెప్టెన్‌లు లఖన్, యోగి, మణిరాజ్, హరీష్, జాకి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాల పనితీరు పరిశీలన

బోథ్, మే 20: బోథ్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయుధాలను స్పెషల్ టీం ఏఆర్ఎస్ఐఆర్ భీమ్రావు నాయక్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ప్రతీనెల ఈ విధమైన తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అయుధాల పనితీరుతో పాటు అవసరమైన మరమ్మతులు సైతం చేయడం జరుగుతుందన్నారు. అవసరమైతే అప్పటికప్పుడే మరమ్మతులు చేసేందుకు సిబ్బంది ఉన్నారని ఆయన తెలిపారు. సోమవారం రోజున గుడిహత్నూర్, బజార్హత్నూర్, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయుధాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు.



బోథ్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

కార్యాలయాన్ని ఖాళీ చేయాలి

● తహసీల్దార్‌కు మహిళా సంఘ సభ్యుల వినతి ● ఐకేపీ సంఘ కార్యాలయంలో గత ఐదేళ్లుగా కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

తలమడుగు, మే 20: మండల కేంద్రంలోని ఐకేపీ సంఘ కార్యాలయంలో గత ఐదు సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయం కొనసాగడంతో మహిళా సంఘాల సభ్యులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే కార్యాలయా న్ని ఖాళీ చేయాలని సోమవారం వసుంధర మండల సమైక్య మహిళ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహిళ సంఘాల సభ్యులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల క్రితం తహసీల్దార్ కార్యాలయం మరమ్మత్తులకు గురైందని రెండు నెలల కోసం మహిళ సమాఖ్య కార్యాలయాన్ని ఉపయోగించుకుంటామని చెప్పి ఐదు సంవత్సరాలు దాటిన ఇంత వరకు మహిళ సమాఖ్య కార్యాలయాన్ని ఖాళీ చేయకపోవడంతో మహిళ సంఘాల సభ్యులకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతు న్నాయన్నారు. గతంలో కూడా పలుమార్లు ఉన్నతాధికారులకు, కార్యాలయం ఖాళీ చేయాలని విన్నవించిన ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మండలం లోని 28 గ్రామ పంచాయతీలో గాను 690 మహిళ సంఘాల గాను 7449 మంది మహిళలు ఉన్నారని, వారికి నెలనెలా సమావేశాలు మహిళ సంఘాల లావాదేవీలు, రుణాల పంపిణీ రుణాల రికవరి సమావేశం చేసేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నామని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్ల సౌక ర్యం లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఐకేపీ కార్యాలయంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఖాళీ చేయించి మహిళ సంఘాలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఇందులో ఐకేపీ ఏపీఎం స్వామి, మహిళ సంఘాల సభ్యుల అధ్యక్షురాలు ప్రమీల సుశీల, సీసీ ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా : తహసీల్దార్ రాజమోహన్

తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయాన్ని ఐకేపీ కార్యాలయంలో అప్పటి అధికారులు ఏర్పాటు చేశారని తహసీల్దార్ రాజమోహన్ పేర్కొన్నారు. అయితే, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరి ష్కరించేందుకు తగిన చర్యలు చేపడతానని తహసీల్దార్ మహిళా సంఘాల సభ్యులకు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీలో చెత్తను శుభ్రం చేస్తున్న సిబ్బంది



జేసీబీ సహాయంతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కదిలిన మున్సిపల్ అధికారులు

● పట్టణంలో హుటాహుటిన పలు కాలనీల్లో చెత్తాచెదారం తొలగింపు





పట్టణంలోని కైలాస్‌నగర్‌లో చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది

ఆదిలాబాద్ అర్బన్, మే 20: ఆదిలాబాద్ పట్టణంలో అస్తవ్యస్థంగా మారిన పారిశుధ్యంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ముక్కు మూసుకోవాల్సిందేనా?' అనే శీరికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు కదిలారు. ఉదయం హుటాహుటిన పలు కాలనీల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు. కేఆర్‌కే కాలనీ, కైలాస్‌నగర్, దస్నాపూర్, ఓల్డ్ హౌజింగ్ బోర్డు, పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్లు, మురికి నీటి కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. అంతేకాకుండా చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. పలు కాలనీల్లో రోడ్ల వెంట మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించే పనులను చేపట్టారు. దీంతో పలు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



సోలంకి పూజకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

పూజకు రూ.3లక్షల చెక్కు అందజేత

ఆదిలాబాద్ అర్బన్, మే 20: జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా మంజూరైన రూ.3లక్షల చెక్కును సోలంకి పూజకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో సోలంకి పూజకు రూ.3లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సోలంకి పూజ భర్త సోలంకి సుధాకర్ ఆర్మీలో పని చేస్తూ సర్వీసులో ఉండగా గత యేడాది 2023 ఆగస్టు 6న మృతి చెందాడు. సెంట్రల్, స్టేట్ ద్వారా ఆర్థిక సహాయం అదించడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్ తన కుటుంబ సభ్యుల వివరాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇందులో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్‌వో తిరుమల, ఆదిలాబాద్ మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, దేవన్న, ఆర్ఐ అశోక్, తిరుపతిరెడ్డి, వామన్‌రెడ్డి పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం : డీడీ

ఉట్నూర్, మే 20: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరించిన జరుగుతుందని ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి జూన్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్, ఆధార్‌కార్డు జతపరచాలన్నారు. జూన్ 12న ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ భవనంలో లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల తల్లిదండ్రులు వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో రూ.2లక్షలు మించకుండా ఉండాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే మూడవ తరగతిలో 50 సీట్లు, 5, 8వ తరగతులలో 25 సీట్ల వంతున ప్రవేశాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పని భారం తగ్గించాలి : ఏఎన్ఎంలు

ఆదిలాబాద్ అర్బన్, మే 20: అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఏఎన్ఎం సమస్యలు పరిష్కరించి పని భారం తగ్గించాలని, జనాభా ప్రాతిపదికన ఏఎన్ఎంలను నియమించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాథోడ్ నరేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో అర్బన్ ప్రైమరీహెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న మొత్తం 12మంది ఏఎన్ఎంలు పని చేస్తున్నారన్నారు. ఒక్కొక్క అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఏఎన్ఎంకు దాదాపు 15 నుంచి 20వేల వరకు జనాభా ఉందని, గతంలో పీపీ యూనిట్ పరిధిలో ఉన్న జనాభాను, అక్కడ పని చేస్తున్న ఏఎన్ఎంలను అర్బన్ హెల్త్ సెంటర్‌లో కలపాలని జీవో ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతి యూపీహెచ్‌సీలో అదనపు ఏఎన్ఎంలను నియమించి పని భారం తగ్గించాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్‌హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నవీన్‌కుమార్, ఏఎన్ఎంలు పుష్పలత, తులసి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న అన్నమొల్ల కిరణ్, ఏఎన్ఎంలు